## దశదిన కర్మకు ఎమ్మెల్యే హాజరు



ఏదుల్లాపూర్‌లో మర్రి ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, డిసెంబర్ 16: మండలంలోని ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మర్రి మహేందర్‌రెడ్డి తండ్రి మర్రి ప్రతాప్‌రెడ్డి దశదిన కర్మకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం హాజరయ్యారు. అనంతరం మర్రి ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, మాజీ సర్పంచ్ బాబురావు, నాయకులు యాదాగౌడ్, కల్లూరి వెంకటేశ్, కుంట లక్ష్మణ్, మహిపాల్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింగరావు, మేకల యాదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్య, వైద్య రంగాల్లో ముందుంచుతా



క్యాంటిన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మెదక్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): విద్య, వైద్య రంగాల్లో మెదక్ నియోజకవర్గాన్ని ముందుంచుతానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మెదక్‌లోని పిల్లికొట్టాల్‌లో ఉన్న మెడికల్ కళాశాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులతో తరగతుల ప్రారంభం కావాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకంలో క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఆయన వెంట కలెక్టర్ రాహుల్ రాజ్, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ శివదయాల్, కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ ఉన్నారు.

## పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

శివ్వంపేట, డిసెంబర్ 16: పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పంచాయతీ కార్మికులతో కలసి ఈ నెల 17న చలో హైదరాబాద్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు జీవో నెం 51ని సవరణ చేయాలన్నారు. పెండింగ్ వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం నాయకులు కిచ్చనోళ్ల నర్సింలు, వసంత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## పెండింగ్ చలాన్లు చెల్లించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నిజాంపేట, డిసెంబర్ 16: వివిధ కారణాలతో వాహనాలకు విధించిన పెండింగ్ చలాన్లను చెల్లించాలని ఏఎస్సై జైపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం నిజాంపేట శివారులో ఏఎస్సై, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు.

## మంజీరా నదిలోంచి ఇసుక చోరీ



బండపోతుగల్ శివారులో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

చిలిపిచెడ్, డిసెంబర్ 16: మండలంలోని బండపోతుగల్ గ్రామంలోని నాయకుల సహకారంతో ఇసుకను ఇష్టారీతిగా మంజీరా నది నుంచి అక్రమంగా తలిస్తున్నారు. రెండు వారాల క్రితం ఇదే గ్రామంలో అక్రమంగా తరలించిన ఇసుక డంప్‌లను తహసీల్దార్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేసి రూ.లక్షా 74వేలకు వేలం వేశారు. ఇప్పటికైనా మంజీరా నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### మట్టి తరలిస్తున్న జేసీబీ పట్టివేత

మండలంలోని మంజీరా నది, చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ సునీల్‌సింగ్ చౌహాన్ హెచ్చరించారు. మండలంలోని బండపోతుగల్ గ్రామంలో అనుమతి లేకుండా చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీని ఆర్ఐ పట్టుకున్నారు.



బండపోతుగల్ చెరువులో మట్టి తవ్వుతున్న జేసీబీని పట్టుకున్న ఆర్ఐ సునీల్ సింగ్ చౌహాన్

# సిలబస్ ఎట్లా పూర్తవుతుందో..?



కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాల



సమ్మెలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు

- సాగని తరగతులు.. పూర్తి కాని సిలబస్
- సమ్మెలో కేజీబీవీ ఉపాధ్యాయులు
- దగ్గరపడుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్
- ప్రత్యామ్నాయ చర్యలకు విద్యాశాఖ యత్నం

మెదక్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): వారం రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తుండడంతో జిల్లాలోని ఎంఈవో కార్యాలయాల్లో పనులు స్తంభించాయి. భవిత కేంద్రాలకు తాళాలు పడ్డాయి. కేజీబీవీల్లో సిలబస్ పూర్తవుతుందో లేదోనని విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. కేజీబీవీల్లో విద్యార్థులకు భోజనం, ఇతరత్రా విషయాల్లో అసౌకర్యం కలుగుతోంది. నాలుగు రోజుల క్రితం నాన్ టీచింగ్ ఉద్యోగులు కేజీబీవీల్లోనే విధులు నిర్వర్తించారు. కానీ ఇప్పుడు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో బోధనపై ప్రభావం పడుతోంది. పది, ఇంటర్మీడియేట్ పరీక్షలు కూడా సమీపిస్తున్నాయి. అంతకుముందు ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్స్ కూడా దగ్గరపడుతున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణతో తరగతులు నిర్వహిస్తున్నారు. కేజీబీవీ విద్యార్థులకు సబ్జెక్టులు పూర్తిగా వెనుకబడిపోవడంతో పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపనున్నది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సివస్తున్నది

### ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధమవుతున్న విద్యాశాఖ

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రత్యామ్నాయ చర్యలకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. రోజూ కేజీబీవీలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో అంతరాయం కలగకుండా చూడాలని ఎంఈవోలను విద్యాశాఖ ఆదేశించింది. మార్చిలో జరిగే పది, ఇంటర్మీడియేట్ పరీక్షల కోసం ముఖ్యమైన తరగతుల నిర్వహణకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని సూచించింది. పదో తరగతి సిలబస్ నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంది. ఇంటర్ ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల గడువు సమీపిస్తోంది. కేజీబీవీల్లో పదుల సంఖ్యలో ఉన్న టీచర్ల స్థానంలో ఒక్కరిద్దరితో బోధన సాధ్యం కాదు.

### ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తాత్కాలిక టీచర్లను ఏర్పాటుచేస్తాం



సమగ్ర శిక్షా ఉద్యోగులు వారం రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నారు. కేజీబీవీలో ఉపాధ్యాయులు 80శాతం మంది సమ్మెలోనే ఉంటున్నారు. మిగతా 20 శాతం మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో సమ్మె అయిపోతుందని భావిస్తున్నాను. సమ్మె ఇలాగే కొనసాగితే తాత్కాలికంగా ఉపాధ్యాయులను పంపిస్తాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సిలబస్‌ను పూర్తి చేసేలా చూస్తాం.

**- రాధాకిషన్, జిల్లా విద్యాధికారి మెదక్**

# పెండింగ్ బిల్లులు సత్వరమే విడుదల చేయాలి



చిన్నశంకరంపేట పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



పెద్దశంకరంపేటలో మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు



మెదక్‌లో అదనపు కలెక్టర్ నగేశ్‌కు మెమోరాండం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

మెదక్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ అదనపు కలెక్టర్ నగేశ్‌కు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సంగయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మెమోరాండం అందజేశారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, డిసెంబర్ 16: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను చిన్నశంకరంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు.

**పెద్దశంకరంపేటలో..**

పెద్దశంకరంపేట, డిసెంబర్ 16: పంచాయతీ నిధులు విడుదల చేయాలని హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిరసనకు వెళ్తున్న మండల మాజీ సర్పంచ్‌లను సోమవారం ఎస్ఐ విఠల్, ఏఎస్ఐ విఠల్ ఆధ్వర్యంలో ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిలో మాజీ సర్పంచ్‌లు రవీందర్, సూర్యప్రకాశ్, శంకర్‌గౌడ్, విఠల్‌గౌడ్ న్నారు.

**శివ్వంపేటలో..**

శివ్వంపేట, డిసెంబర్ 16: గ్రామాల్లో గతంలో చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహించతలపెట్టిన మాజీ సర్పంచులను ఎస్సై మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు రంగవల్లి పార్వతీ సత్యం, బాలమణి నరేందర్, అనూష అశోక్‌గౌడ్, సోము అశోక్, చంద్రకళ శ్రీశైలంయాదవ్ ఉన్నారు.

**చిలిపిచెడ్‌లో..**

చిలిపిచెడ్, డిసెంబర్ 16: మాజీ సర్పంచుల సమస్యలు పరిష్కారానికి హైదరాబాద్ తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్, బుజ్జిబాయి, యాదగిరి, శంకర్‌నాయక్‌ను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు సోమవారం తరలించారు.



శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



చిన్నశంకరంపేటలో మాజీ సర్పంచ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# సజావుగా గ్రూప్ 2 పరీక్ష

- జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- రెండో సెషన్‌లో 2,809 పరీక్ష రాయగా, 3046 మంది గైర్హాజరు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్‌లో గ్రూప్ 2 పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్




జిల్లా కేంద్రంలోని గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పరీక్షా సజావుగా కొనసాగుతున్నదని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రెండో రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. టీజీపీఎస్సీ నిబంధనలు మేరకు పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి లేని కారణంగా కలెక్టర్ తన ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పాటించాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. రెండో రోజు ఉదయం 2,815 మంది, మధ్యాహ్నం 2,809 పరీక్ష రాసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఎగ్జామినేషన్ సెంటర్ ఇన్‌చార్జి సంబంధిత అధికారులు ఉన్నారు.

### పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ కొనసాగింపు

మెదక్ అర్బన్, డిసెంబర్ 16: గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్‌ను కొనసాగిస్తున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లాలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..రెండో రోజు రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో ఉందన్నారు. ఎలాంటి సభలు ర్యాలీలు సమావేశాలకు అనుమతులు లేవని, పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తుండాలని సూచించారు.

## మెదక్‌లో అంబేద్కర్ భవనం నిర్మించాలని ధర్నా



మెదక్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనాన్ని తక్షణమే నిర్మించాలని కలెక్టరేట్ ఎదుట దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అస్తరుగళ్ల బాలరాజ్, జిల్లా దళిత సంఘాల నాయకులు పాతూరి రాజు, ముస్కూరి వెంకట్ మాట్లాడారు. అన్ని కుల వర్గాల సంఘాలకు సామూహిక భవనాల నిర్మాణ పనులు కొనసాగించడం లేదన్నారు. జిల్లా స్థాయిలో అన్ని భవనాలు ఏర్పడినప్పటికీ అంబేద్కర్ భవనం పనులు మాత్రం ఇంతవరకూ చేపట్టడం లేదని ఆరోపించారు. పదేండ్ల నుంచి నిలిచిపోయిన అంబేద్కర్ భవనం తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ కళామండలి జిల్లా కోశాధికారి అలారం ప్రేమ్ కుమార్, అలారం సుమన్, యేసు రత్నం, తొంట దుర్గాపతి, బీఎస్పీ అప్పాచిపల్లి సురేశ్, చంద్రం, మాలల హక్కుల సాధన సమితి బొమ్మల మైసయ్య, నాయకులు మల్లేశం, ఎల్లం, నర్సింలు, చంద్రయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన చెత్త ఉన్నా పట్టించుకోరా?

### వ్యర్థాల కంపుతో ప్రయాణికులకు ఇబ్బందులు



శివ్వంపేటలో ప్రధాన రహదారిపై పక్కనే వేసిన చెత్త

శివ్వంపేట, డిసెంబర్ 16: శివ్వంపేటలోని తూప్రాన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై చెత్త పారేయడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శివ్వంపేటలో పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తను డంపు యార్డుకు తరలించకుండా రహదారి పక్కనే పారబోస్తున్నారు. దీంతో చెత్తలో దొరికే ఆహారం కోసం కుక్కలు, కోతులు, పందులు రోడ్డుపైకి తెస్తున్నాయి.. చెత్తతో పాటు పక్కనే పెద్ద మురుగు గుంత ఏర్పడి దుర్వాసన వెదజల్లుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై వేసిన చెత్తను తొలిగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంలో ఎంపీవో తిరుపతిరెడ్డిని వివరణ కోరగా సేకరించిన చెత్తను డంపు యార్డుకు తరలిస్తామన్నారు. రోడ్ల పక్కన వేయకుండా చర్యలు చేపడుతామని తెలిపారు.



శివ్వంపేట ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా మురికి గుంత, చెత్తా చెదారం

### ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి: డీఈవో రాధాకిషన్



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఈవో రాధాకిషన్

పాపన్నపేట, డిసెంబర్ 16: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, విద్యార్థుల అభివృద్ధికి ప్రతి టీచర్ కృషి చేయాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. సోమవారం మండలంలోని అన్నారం, అబ్లాపూర్, బాచారం గ్రామాల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వివిధ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏఎంవో సుదర్శనమూర్తి, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, పాపన్నపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబర్ 16: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

### 32 మంది క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మెదక్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర చాంపియన్‌షిప్ 2024 పోటీలకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 32 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటరమణ, ఎ.మధుసూదన్ తెలిపారు. సోమవారం మెదక్ అథ్లెటిక్స్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 16, 18, 20 మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఎంపికలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన 32 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. 22న నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు మెదక్ జిల్లా తరపున పాల్గొంటారు.

### నేడు ఫుట్‌బాల్ క్రీడలు ప్రారంభం

మెదక్ అర్బన్, డిసెంబర్ 16: జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలలో 1500 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## పొలానికి మిషన్ భగీరథ నీళ్లు మళ్లింపు



వాటర్‌ట్యాంకు ఓవర్‌ఫుల్‌తో వాటర్‌మెన్ సిద్ధులు పొలంలో పడుతున్న భగీరథ నీళ్లు

కొమురవెల్లి, డిసెంబర్ 16: మండలంలోని తపాస్‌పల్లిలో గ్రామస్తులు సరైన తాగునీరు రాక ఇబ్బందులు పడుతుంటే ఆ ఊరి వాటర్‌మెన్ సిద్ధులు మిషన్ భగీరథ నీళ్లతో తన పొలాన్ని పారించుకుంటున్నాడు. నీళ్లు సరిపడా రావడం లేదని గ్రామస్తులు గతంలో ఎన్నో సార్లు ఆందోళన చేసినప్పటికీ అధికారులు పట్టించుకున్న పాపన పోలేదు. గ్రామానికి ఇవ్వాల్సిన నీళ్లను వాటర్‌మెన్ తనపొలానికి పారించుకుంటున్నాడని అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

## బండరాయితో మోది హత్య

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 16: కోరిక తీర్చలేదనే కసితో తలపై బండరాయితో బాది మహిళను హతమార్చిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గాజులకొత్రిక ప్రాంతానికి చెందిన గజ్జల నరేశ్ కొన్నేండ్ల కిందట తన సోదరుడు, తల్లితో కలిసి హైదరాబాద్‌కు వలసవచ్చాడు. తల్లి మృతి చెందింది. సోదరుడు తిరిగి సొంత ఊరికి వెళ్లాడు. నరేశ్ ఇక్కడే ఉంటూ దినసరి కూలీగా పని చేసుకుంటూ చింతల్‌లోని ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్నాడు. వచ్చిన డబ్బుతో మద్యం సేవించి, చెడు అలవాట్లకు బానిసయ్యాడు. కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని హెచ్‌ఎంటీ మైదానం ఫుట్‌పాత్‌పై ఉంటున్న పద్మ (45) ఇక్కడే యాచకురాలిగా ఉంటూ వేశ్యగా మారింది. ఈ నెల 10న పద్మ, నరేశ్ ముందరే మరో వ్యక్తితో హెచ్‌ఎంటీ జంగల్‌లోకి వెళ్లింది. తిరిగి వచ్చాక తన కోరిక తీర్చాలనడంతో నిరాకరించింది. దీంతో నరేశ్ అదే రోజు రాత్రి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న పద్మ తలపై దాడి చేసి చంపేశాడు. పద్మ మృతిచెందిందని నిర్ధారించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.